

పోటీపరీక్షలకు ఉపయుక్తం

సామాజిక ఆర్థిక ముఖచిత్రం పుస్తకం పోటీపరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు ఉపయోగపడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.

- 9లో ▸



లక్ష్యం దిశగా ఆయిల్‌పామ్ సాగు

జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు లక్ష్యాన్ని నెరవేర్చే దిశగా ఉద్యాన శాఖ అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
40.7 /27.5

వాతావరణం

ఉదయం ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఎండతీవ్రత పెరుగుతుంది. ఉక్కపోతగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి. సాయంత్రం వేళ వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయిలో సత్తా చాటాలి



కామారెడ్డి క్రైం : జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో సత్తా చాటాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో సీఎం కప్ జిల్లాస్థాయి క్రీడా పోటీలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. క్రీడాకారులు క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. గెలుపు, ఓటమిలను సమానంగా స్వీకరించాలన్నారు. నేటి ఓటమి రేపటి గెలుపునకు నాంది పలుకుతుందన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం సీనియర్ సిటిజన్ ఫోరంలో టేబుల్ టెన్నిస్ క్రీడలను కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఈవో రాజు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి రసూల్, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

నిధులున్నాయ్.. పనులు చేయండి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్



భిక్కనూరు : ప్రభుత్వం ఆస్పత్రుల అభివృద్ధికి నిధులు సిద్ధంగా ఉన్నాయని కాంట్రాక్టర్లు పనులు చేయడమే ఆలస్యమని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. మంగళవారం భిక్కనూరు మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఆస్పత్రుల అభివృద్ధి కోసం డబ్బులు ఖజానాలో సిద్ధంగా ఉన్నాయని కాంట్రాక్టర్లు పనులు చేయడం పూర్తయితే బిల్లులు వెంటనే చెల్లిస్తామన్నారు. పనులను నాణ్యతగా చేపట్టాలని సూచించారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, ఎంపీడీవో అనంత్ రావు, ఎంపీవో ప్రవీణ్‌కుమార్, వైద్యురాలు యెమిమా, ఎంపీపీ గాలిరెడ్డి, జెడ్పీటీసీ పద్మ నాగభూషణంగౌడ్ ఉన్నారు.

శానిటేషన్ పనులు పూర్తి కావాలి..

రాజంపేట : రాజంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శానిటేషన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ ఆదేశించారు. మంగళవారం రాజంపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఆయన సందర్శించారు. ఆస్పత్రిలో చేపడుతున్న శానిటేషన్ పనులపై ఆరా తీశారు. అనంతరం గర్భిణులతో మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న న్యూట్రిషన్ కిట్లను గర్భిణులు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, తహసీల్దార్ శాంత, ఎంపీడీవో బాలకిషన్, సర్పంచ్ సౌమ్యనాగరాజు పాల్గొన్నారు.

29న 'పీఎఫ్ నిధి ఆప్కే నికట్'

నిజామాబాద్ సిటీ: పీఎఫ్ కార్యాలయం ఆధ్వర్యంలో మల్లారం, బాన్సువాడ పట్టణాలలో నిధి ఆప్కే నికట్ 2.0(మీ ఇంటివద్దకు ఈపీఎఫ్ఓ) కార్యక్రమాన్ని ఈ నెల 29న నిర్వహిస్తున్నట్లు పీఎఫ్ సహాయక కమిషనర్ బి మధుసూదనాచారి ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ రూరల్ మండలం మల్లారంలో గల దేశాయ్ బ్రదర్స్ లిమిటెడ్‌లో పీఎఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ వి శ్రవణ్ కుమార్, బాన్సువాడ పట్టణం మున్సిపల్ కౌన్సిల్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ ఎస్ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో నిధి ఆప్కే నికత్ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. పీఎఫ్ చందాదారులు, యజమానులు, పెన్షనర్లు తగిన ఆధారాలతో నిధి ఆప్కే నికత్ 2.0 హాజరు కావాలని, ఫిర్యాదులను విని అక్కడికక్కడే పరిష్కరిస్తామన్నారు. ఈ ప్రోగ్రామ్‌లో పాల్గొనాలనుకునేవారు ro.nizamabad@epfindia.gov.in అనే ఈ మెయిలు అడ్రస్ ద్వారా, లేదా, ప్రాంతీయ భవిష్యనిధి కమిషనర్ నిజామాబాద్‌లో ముందుగా సమర్పించిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కారం అవుతాయని సహాయక కమిషనర్ తెలిపారు.

కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపిన జేపీఎస్‌లు

కామారెడ్డి టౌన్ : జూనియర్, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించడంతో మంగళవారం జిల్లా పంచాయతీ కార్యదర్శులు కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను కలిసారు. కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ చంద్రమోహన్‌ను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల జేపీఎస్‌లు పాల్గొన్నారు.

తీపి పంట చేదైంది..!

- నల్లబెల్లం పేరుతో ఆంక్షలు
- స్వరాష్ట్రంలో నిలిచిపోయిన బెల్లం తయారీ
- జిల్లాలో కరువైన ఇంటి బెల్లం
- ఇతర పంటలవైపు మరలుతున్న రైతులు



బెల్లం వండుతున్న రైతులు (ఫైల్)

■ భిక్కనూరు మండలం తిప్పాపూర్ గ్రామానికి చెందిన రైతు వంగేటి నర్సారెడ్డి అరవై ఎకరాల్లో చెరకు పంట సాగు చేసి బెల్లం వండేవారు. ఆయన చెరకు పంటను, బెల్లం తయారీని చూడడానికి ఎక్కడెక్కడి నుంచో రైతులు వచ్చి చూసి మెళకువలు తెలుసుకునేవారు. అయితే తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత బెల్లం తయారీపై ఆంక్షలు విధించడంతో బెల్లం తయారీ మానుకుని చెరకును ఫ్యాక్టరీకి తరలించాడు. చెరకు నరకడం, తరలించడంలో అనేక ఇబ్బందులు ఎదురయ్యేవి. ఏడాది కష్టానికి తగిన ఫలితం రావడం లేదని రెండేళ్లుగా చెరకు పంట నుంచి తప్పుకున్నాడు. బెల్లం వండినపుడే నాలుగు డబ్బులు కనిపించేవని నర్సారెడ్డి పేర్కొంటున్నాడు. చెరకు స్థానంలో ఇతర పంటలు సాగు చేస్తున్నాడు.



సాక్షి, కామారెడ్డి : చెరకు రైతుకు మార్కెట్‌లో ఎంతో డిమాండ్ ఉండేది. చేనులో చెరకు పంట ఉందంటే చాలు బ్యాంకులో డబ్బులు ఉన్నట్టే. బిడ్డ పెళ్లి చేయాలన్నా, ఇళ్లు కట్టుకుందామన్నా, ఇంత భూమి కొనాలన్నా చెరకు రైతుకు షావుకార్లు పిలిచి మరీ అప్పులు ఇచ్చేవారు. అంటే చెరకు పండించే రైతుకు మార్కెట్‌లో అంత విలువ ఉండేది. బెల్లంతో నాలుగు పైసలు మిగిలేవి. రైతు కూడా ధైర్యంగా ఉండేవాడు. ఇదంతా గతం. ఇప్పుడు పరిస్థితులన్నీ తలకిందులయ్యాయి. తరతరాలుగా బెల్లం తయారు చేస్తూ వచ్చిన రైతులు ప్రభుత్వాల ఆంక్షలతో బెల్లం తయారీని మానుకున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు సీఎం ఉన్నప్పుడు బెల్లంపై ఆంక్షలు విధించి రైతులను ఇబ్బందుల పాలు చేశాడు. బెల్లం రైతులు పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తే వారిని జైళ్లకు కూడా పంపించారు. అయితే దివంగత సీఎం వైఎస్సార్ అధికారంలోకి వచ్చాక బెల్లంపై ఆంక్షలను ఎత్తివేసి ప్రోత్సహించడంతో బెల్లం తయారీ పెరిగింది. అయితే స్వరాష్ట్రంలోనూ బెల్లంపై ఆంక్షలు విధించారు. బెల్లం వండితే జైలుకే పంపుతామంటూ ఎక్సైజ్ యంత్రాంగం అప్పట్లో ఊరూరా ప్రచారం చేపట్టింది. దీంతో రైతులు బెల్లం తయారీని మానుకున్నారు. ఉన్న చెరకు పంటను ఫ్యాక్టరీలకు పంపి చెరకు పంటకు దండం పెట్టారు. గడచిన ఏడెనిమిదేళ్లుగా బెల్లం తయారీ లేకుండాపోయింది. బెల్లం లేకపోవడంతో రైతులు చెరకు సాగుకు దూరమై ఇతర పంటల వైపు మరలిపోయారు. ఇంకా మిగిలిన కొద్దిమంది చెరకు రైతులు కూడా తీపి పంటను వదిలేస్తున్నారు.



గాంధీ గంజ్ బెల్లానికి పెట్టింది పేరు..!

జిల్లా కేంద్రమైన కామారెడ్డి పట్టణంలోని గాంధీ గంజ్ బెల్లం వ్యాపారానికి పెట్టింది పేరు. ఇక్కడి వ్యాపారులు రూ. కోట్లల్లో బెల్లం దందా చేసేవారు. కామారెడ్డి మార్కెట్ నుంచి గుజరాత్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు బెల్లం తరలిపోయేది. కామారెడ్డి ప్రాంతంలో ఎక్కువగా తిప్పాపూర్, రామేశ్వర్‌పల్లి, ఆరెపల్లి, ర్యాగట్లపల్లి, బస్వాపూర్, దోమకొండ, అంబారీపేట, బండరామేశ్వర్‌పల్లి, మోతె, లచ్చాపేట, మాందాపూర్ తదితర గ్రామాల్లో పెద్ద ఎత్తున బెల్లం తయారు చేసేవారు. వేలాది ఎకరకాల్లో చెరకు పంట సాగయ్యేది. ఒక్కో ఏడాది మార్కెట్‌కు 30 వేల క్వింటాళ్ల నుంచి 40 వేల క్వింటాళ్ల దాకా బెల్లం తరలివచ్చేది. బయటి మార్కెట్‌లో అంతకు రెట్టింపు బెల్లం అమ్ముకునేవారు. అయితే బెల్లంపై ఆంక్షలు విధించిన తరువాత కామారెడ్డి గాంధీ గంజ్ రూపమే మారిపోయింది. అక్కడ బెల్లం సువాసనలు లేవు. బెల్లం ముద్దలు నిల్వ ఉండాల్సిన దుకాణాలన్నీ బోసిపోయాయి.

పొరుగు బెల్లమే దిక్కాయే..

అప్పట్లో ఊరూరా ఏ పొలం దగ్గరకు వెళ్లినా బెల్లం ఉడికిస్తూ కుటుంబాలన్నీ పొలాల దగ్గరే గడిపేవి. బెల్లం వండిన రైతులు బెల్లం ముద్దలను బంధువులు, స్నేహితులకు పంపించేవారు. ఉగాది పచ్చడితో పాటు ఇతర అవసరాలకు చాలా కుటుంబాలు బెల్లం వాడుతాయి. అలాంటిది తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత బెల్లంపై విధించిన ఆంక్షల మూలంగా స్థానికంగా బెల్లం తయారీ నిలిచిపోయి అందరూ ఆంధ్ర నుంచి వచ్చే బెల్లం కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. మార్కెట్‌లో బెల్లం కిలోకు రూ.55 నుంచి రూ.72 దాకా అమ్ముతున్నారు. గతంలో బెల్లం వండిన రైతులు కూడా ఇప్పుడు తమ అవసరాల కోసం కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. రక్తహీనతతో ఇబ్బంది పడుతున్న కిషోర బాలికలు, గర్భిణీలకు బెల్లంతో కూడిన పల్లి, నువ్వుల పట్టీలు తినిపించమని వైద్యులు సలహాలు ఇస్తుంటారు. అందుబాటులో బెల్లం లేకపోవడం, కొనాలంటే ధరలు అందుబాటులో లేకపోవడం ఇబ్బందికరంగా మారింది. మన దగ్గర ప్రభుత్వం బెల్లంపై విధించిన ఆంక్షలను ఎత్తివేసి, రైతులను ప్రోత్సహిస్తే అటు రైతులకు, ఇటు ప్రజలకు మేలు కలుగనుంది.

ఏడాది	బెల్లం కొనుగోలు (క్వింటాళ్లలో)
2005-06	6,983
2006-07	31,622
2007-08	43,632
2008-09	20,501
2009-10	26,214
2010-11	33,947
2011-12	33,901
2012-13	33,281
2013-14	31,942
2014-15	32,858
2015-16	19,034

బల్దియా స్థలాలను
కాపాడండి

- అధికారులకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఆదేశం
- 'సాక్షి' కథనానికి స్పందన
- చర్చనీయాంశంగా, మారిన కథనం

సాక్షి ఎఫెక్ట్..

కామారెడ్డి టౌన్ : కామారెడ్డి పట్టణంలోని మున్సిపల్ ఓపెన్ స్థలాలు ఆక్రమణలు, కబ్జాలకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులకు ఆదేశించారు. మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన మున్సిపల్ స్థలాలకు సంబంధించి 'కబ్జా చెయ్..బోర్డు పాతెయ్' కథనానికి స్పందించారు. ఓపెన్ స్థలాలకు కంచెలను ఏర్పాటు చేసి బోర్డు పాతాలని అధికారులకు సూచించారు. సాక్షిలో వచ్చిన ఈ కథనానికి బల్దియాలో, కౌన్సిలర్లలో చర్చనీయాంశంగా మారి కలకలం రేపింది. కబ్జాలో భాగస్వాములుగా ఉన్న కొందరు కౌన్సిలర్‌లు ప్రత్యేకంగా సమావేశం పెట్టుకుని చర్చించుకున్నారని సమాచారం. మరి కొందరు కౌన్సిలర్లు ఈ స్థలాలను కాపాడేందుకు కౌన్సిల్‌లో చర్చించాలని మాట్లాడుకున్నారు.

వెల్‌డన్ ఉమా హారతి

- అభినందించిన హైదరాబాద్ సిటీ కమిషనర్ సీవీ ఆనంద్

సాక్షి, కామారెడ్డి : సివిల్ సర్వీసెస్ లో మూడో ర్యాంక్ సాధించిన పోలీస్ అధికారి నూకల వెంకటేశ్వర్లు కూతురు ఉమా హారతిని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ట్విట్టర్ ద్వారా అభినందించారు. తాను ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఎస్పీగా 1996–99లో పనిచేసినప్పుడు వెంకటేశ్వర్లు కామారెడ్డి టౌన్ ఎస్సైగా పనిచేశాడని, అప్పట్లో నక్సల్స్‌ను అణిచివేయడంలో వీరోచితంగా పోరాడి ప్రశంసలు పొందారన్నారు. ప్రస్తుతం వెంకటేశ్వర్లు నారాయణపేట జిల్లా ఎస్పీగా పనిచేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఉమా హారతిని, ఆమె తండ్రి వెంకటేశ్వర్లునకు సీవీ ఆనంద్ ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.

జాతీయ రహదారిపై రైతుల ధర్నా



ధర్నా చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న జుక్కల్ తహసీల్దార్ గణేశ్

- గన్నీబస్తాలు, లారీల కోసం ఆందోళన
- సముదాయించిన అధికారులు

నిజాంసాగర్(జుక్కల్): వరిధాన్యం తుకాలకు గన్నీ బస్తాల్లేవని, లారీలు కూడా రావట్లేదని పేర్కొంటూ మంగళవారం జుక్కల్ చౌరస్తాలో సంగారెడ్డి–నాందేడ్ జాతీయ రహదారిపై రైతులు ధర్నా చేశారు. ఖండేబల్లూర్, కల్లాలి, కౌలాస్, మహమ్మదాబాద్ గ్రామాల రైతులతో కలిసి వైఎస్సార్‌టీపీ నాయకుడు బోర్గి సంజీవ్ ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకాలకు, సొసైటీ సిబ్బంది ఇబ్బందులకు గురిచేస్తున్నారని వారు మండిపడ్డారు. జాతీయ రహదారిపై రైతులు ఆందోళన చేస్తూ ధర్నాకు దిగడంతో వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ సమస్యల ఏర్పడింది. విషయం తెలుసుకున్న జుక్కల్ తహసీల్దార్ గణేశ్, ఎస్సై మురళి రైతుల వద్దకు చేరుకొని వారితో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలకు లారీలను పంపిస్తామని, గన్నీ బస్తాలను స రఫరా చేస్తామని ఆయన రైతులకు హామీ ఇచ్చారు. అధికారులు, పోలీసులు హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళనను విరమించారు.

ఈ విషయమై జుక్కల్ సొసైటీ సీఈవో బాబు రావ్‌ను సాక్షి ఫోన్‌లో సంప్రదించగా నాలుగైదు రోజులుగా లారీలు రావట్లేదని, నాలుగు కేంద్రాల్లో 8,500 ధాన్యం బస్తాలకు పైగా నిల్వ ఉన్నాయన్నారు. లారీల కొరత తీవ్రంగా వేధిస్తోందని ఆయన పేర్కొన్నారు. రైతులు ధర్నాకు దిగడంతో ఆర్టీవో అధికారులు నాలుగు లారీలను పంపడంతో ధాన్యం బస్తాలను తరలించామన్నారు.

అనుమానాస్పద స్థితిలో సర్పంచ్ భర్త మృతి

- ఆత్మహత్యగా భావిస్తున్న పోలీసులు
- హత్య చేశారంటున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు

కామారెడ్డి క్రైం : రామారెడ్డి మండలం సింగరాయపల్లి సర్పంచ్ భర్త, సీనియర్ నాయకుడు అధికం నర్సాగౌడ్ (48) అనుమానాస్పదంగా మృతి చెందారు. సోమవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన మంగళవారం ఉదయం జిల్లా పోలీస్ కార్యాలయానికి కూత వేటు దూరంలోని ఓ నిర్మానుష్య ప్రదేశంలో మృతదేహమై కనిపించాడు. గ్రామానికి చెందిన నర్సాగౌడ్ గతంలో రెండుసార్లు ఎంపీటీసీగా, ఓసారి వైస్ ఎంపీపీగా పని చేశారు. కొద్దికాలం అప్పటి ఉమ్మడి మాచారెడ్డి మండలానికి ఇన్‌చార్జి ఎంపీపీగానూ కొనసాగారు. కామారెడ్డిలోని అశోక్‌నగర్ కాలనీలో నివాసం ఉంటూ హోటల్ వ్యాపారం చేసేవారు. ఆయన భార్య మహేశ్వరి ప్రస్తుతం సింగరాయపల్లి సర్పంచ్‌గా ఉన్నారు.

22న పాల్వంచ మండల ఏర్పాటు సభలో పాల్గొన్న నర్సాగౌడ్ సాయంత్రం ఇంటికి వచ్చి 7.30కు బయటకు వెళ్లి తిరిగి రాలేదని కుటుంబసభ్యులు పేర్కొన్నారు. రాత్రి ఫోన్ చేస్తే స్విచ్ఆఫ్ వచ్చిందన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయానికి కొద్ది దూరంలో పాత భవన నిర్మాణం వెనక నర్సాగౌడ్ మృతదేహం ఉన్నట్లు ఉదయం 10 గంటలకు గమనించి స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చా రు. డీఎస్పీ సురేష్, రూరల్ సీఐ శ్రీనివాస్, దేవునిపల్లి ఎస్సై ప్రసాద్‌లు ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. మద్యంలో విషం కలుపుకొని ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు భావిస్తుండగా ఆయనకు ఆత్మహత్య చేసుకోవాల్సిన అవసరం లేదని, హత్యచేసి ఉంటారని, చేతులు, ముఖంపై గాయాలున్నాయని బంధువులు అనుమానిస్తున్నారు.



సంఘటనా స్థలంలో నర్సాగౌడ్ మృతదేహం



నర్సాగౌడ్ (ఫైల్)

మృతదేహంతో ఆందోళన

రామారెడ్డి : సింగరాయపల్లి సర్పంచ్ అధికం మహేశ్వరి భర్త అధికం నర్సాగౌడ్ మృతికి గ్రామానికి చెందిన చెన్నం నరసింహారెడ్డితో పాటు మరో ఐదురుగు కారణమని ఆరోపిస్తూ గ్రామస్తులు మృతదేహంతో చెన్నం నరసింహారెడ్డి ఇంటి ఎదుట ఆందోళనకు దిగారు. ముందే విషయాన్ని గ్రహించిన నరసింహారెడ్డి కుటుంబీకులు ఇంటికి తాళం వేసి పరారయ్యారు. ఘటనా స్థలానికి కామారెడ్డి డీఎస్పీ సురేశ్, రూరల్ సీఐ శ్రీనివాస్ గౌడ్, రామారెడ్డి ఎస్సై అనిల్ చేరుకుని నిందితులను శిక్ష పడేలా చూస్తామని చెప్పి మృతదేహాన్ని అంత్యక్రియలకు తరలించారు. అంతకుముందు కుటుంబ సభ్యులను ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ పరామర్శించారు.



చెన్నం నరసింహారెడ్డి ఇంటి ముందు మృతదేహంతో ఆందోళన చేస్తున్న బంధువులు

వారం క్రితం గ్రామ సభలో..

వారం క్రితం గ్రామసభలో జీపీ నిధుల వినియోగం, బెల్టుషాప్ వేలం విషయంలో సర్పంచ్ భర్తను కొందరు ప్రశ్నించినట్లు తెలిసింది. అయితే తన ప్రతిష్ఠకు భంగం కలిగేలా వాట్సప్ గ్రూప్‌లలో పోస్టింగ్‌లు పెట్టారని నర్సాగౌడ్ ఇటీవల కొందరిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఓ ముగ్గురు వ్యక్తులను పిలిపించి విచారించారు. నర్సారెడ్డికి ఆ ర్థిక ఇబ్బందులున్నట్లు మరికొందరు పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు న్నారు. భార్య ఫిర్యాదుతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పౌల్ట్రీ రైతు విలవిల

- ఎండవేడికి మృత్యువాత పడుతున్న కోళ్లు
- వాటిని బతికించేందుకు తడిసి మోపెడవుతున్న ఖర్చు
- ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పౌల్ట్రీరైతులు

ఎండాకాలం.. కోళ్లపాలిట మృత్యుకాలంగా మారుతోంది. తీవ్రమైన వేడి.. 'పౌల్ట్రీ'పై ప్రభావం చూపుతుంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో కోళ్లలో వ్యాధి నిరోధక శక్తి సన్నగిల్లుతుంది. దీంతో వీటిని కాపాడుకునేందుకు పౌల్ట్రీ రైతు పడుతున్న కష్టాలు అన్నీఇన్నీ కావు. ఫలితంగా వ్యవసాయ అనుబంధ రంగాల్లో కీలకపాత్ర పోషించే కోళ్ల పరిశ్రమ కుదేలవుతుంది.



బీబీపేట : పౌల్ట్రీ రంగంపై ఆధారపడిన రైతులను ఎండాకాలం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. కోళ్లను నమ్ముకున్న ఫాం రైతులకు తీరని నష్టం వాటిల్లుతోంది. మండే ఎండల నుంచి వాటిని కాపాడుకునేందుకు ఖర్చు పెరిగిపోతుండడంతో పౌల్ట్రీ రైతులు ఆగమాగమైతున్నారు. కోడి పిల్లలు నుంచి 45రోజుల పాటు వాటిని బతికించి అమ్మేవరకు వాటిని సంరక్షించినప్పటికీ ధర సరిగ్గా రాక రైతులు నష్టాలపాలడుతున్నారు.

గోనె సంచులు, గడ్డితో..

మండే ఎండల నుంచి కోళ్లను కాపాడేందుకు కోళ్ల ఫారం పైన ఎండు గడ్డి, తుంగ లాంటివి వేసి కప్పుతున్నారు. అంతే కాకుండా ఫారం చుట్టూ గోనె సంచులు కట్టి వాటిపై ఎప్పటికప్పుడు నీళ్లు చల్లుతున్నారు. ఫారంపైన స్ప్రింక్లర్లు ఏర్పాటు చేసి పైన వేసిన గడ్డి తడిసేలా ప్రతి గంటకు ఒకసారి నీళ్లను చల్లిస్తున్నారు. అంతే కాకుండా రోజు ఉదయం నుండి సాయంత్రం ప్రతి రెండు గంటలకు ఒకసారి స్ప్రే పంపులతో కోళ్లపై స్ప్రే చేస్తేనే అవి ఉపశమనం పొందుతున్నాయి. అయినప్పటికీ వేడిగాలుల కారణంగా చాలావరకు కోళ్లు మృత్యువాత పడుతున్నాయి.

జిల్లావ్యాప్తంగా

జిల్లావ్యాప్తంగా సుమారు 32లక్షల బాయిలర్ కోళ్లు ఉండగా, 6లక్షలకు పైగా లేయర్ కోళ్లు ఫారాల్లో వివిధ దశల్లో ఉన్నాయి. ఒక కోడి పెంచి మార్కెట్‌కు తరలించాలంటే సుమారు ఫారంలో 45రోజులు పెంచాల్సి వస్తుంది. అయితే ఇతర రోజుల్లో కాకుండా ఎండాకాలంలో మాత్రం పౌల్ట్రీరైతులతో అదనపు భారం పడుతోంది. సుమారు 5 వేలు ఉన్న కోళ్ల ఫారం పైన ఎండు గడ్డి వేయాలంటే ఒక్కో గడ్డి కట్టడానికి ట్రాక్టర్‌కు రూ. 30 చెల్లిస్తే ఫారం మొత్తానికి 30 గడ్డి కట్టలు వేయాల్సిన అవసరం ఏర్పడుతుంది. 30 గడ్డి కట్టలకు రూ. 900 ఖర్చు అవుతుంది. గడ్డి కొనుక్కు రావాలంటే ఒక్కో గడ్డి కట్టకు రూ. 40 వరకు తీసుకుంటున్నారు. మొత్తం కలిపితే రూ.1,200 ఖర్చు అవుతుంది. దానిని పైన వేసి కప్పాలంటే రెండు రోజుల పాటు నలుగురు కూలీలు అవసరమవుతుంది. ఇలా ఒక్కో ఫారం మీదికి సుమారు రూ. 10 వేల వరకు ఖర్చు అవుతుంది. అంతే కాకుండా స్ప్రింక్లర్లు ఏర్పాటు చేసుకోవాలంటే సుమారు 5 వేల కోళ్లు ఉన్న ఫారానికి రూ. 7 వేల ఖర్చు అవుతుంది. ఫారం లోపల కూడా అనునిత్యం చల్లగా ఉండేలా ఫాగర్స్ కూడా ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఏర్పడుతుంది.

ఇంత చేసినా లాభాల్లేవు..

పౌల్ట్రీ రంగంలోకి కార్పొరేట్ శక్తులు రావడమే కాకుండా కోడి ధరలు అమాంతం పడిపోతున్నాయి. షెడ్‌లో 6 వేల కోళ్లను పెంచడానికి రూ. 12 లక్షలు పెట్టుబడి అవసరం. కోడిపిల్లను రూ. 25 నుంచి 30 వరకు కొనుగోలు చేస్తారు. మొక్కజొన్న ధరలు, సోయాబీన్ ధరలు తగ్గినా దానా ధర మాత్రం తగ్గడం లేదు. అంతే కాకుండా కోడి పిల్ల దశ నుంచి అమ్మే వరకు 45 రోజుల్లో మూడున్నర కిలోల దాణా ఆహారంగా తీసుకుంటుంది. అంటే దాదాపు రూ. 180 వరకు ఆహారం తీసుకుంటుంది. ఊనుక, వైద్యం, విద్యుత్, పనిచేసేవాళ్లతో కలిపి ఒక్కో కోడి పెంపకానికి రూ. 200 పైగా వెచ్చించాల్సి వస్తోంది. ఇక కోళ్లను విక్రయించే సమయంలో పేపర్ రేట్ శుక్రవారం రూ. 125 ఉండగా మైనస్ రూ. 10 నుంచి 15 వరకు అంటే రూ. 110కు విక్రయిస్తున్నారు. అయితే పౌల్ట్రీ రైతులకు తప్ప ట్రేడర్లకు, చికెన్ సెంటర్లకు మాత్రం లాభం చేకూరుతుంది.



కోళ్ల ఫారం పైన కప్పిన ఎండు గడ్డి



ఎండవేడి తట్టుకోలేక చనిపోయిన కోళ్లు

ఎండాకాలం కష్టాలే ఎక్కువ



మండే ఎండల్లో కోళ్లను కాపాడుకోవడానికి అవస్థలు పడా ల్సి వస్తుంది. ఒకవేళ కోళ్లు దింపుకోకపోతే ఏం చేయా లో తోచడం లేదు. ఎండాకాలంలో వేడి నుండి కోళ్లను రక్షించుకోవడానికి ఎండు గడ్డి, ఫాగర్స్, స్ప్రింక్లర్స్ లాంటివి ఏర్పాటు చేసుకోవడంతో పాటు ఇద్దరు కూలీలు ఏర్పాటు చేసుకోవాలి. ఎండ వేడికి ఫారం మొత్తం చల్లబడేలా నీటితో తడుపుతూ కోళ్లను ఉంచాలి. అలాంటప్పుడే కోళ్లు చనిపోకుండా ఉంటా యి. ఇంత చేసినా నష్టాలు వస్తున్నాయి. ప్రభుత్వం కోళ్ల ఫారాల రైతులకు తగిన విధంగా ప్రోత్సాహా న్ని అందించాలి.

– రాజయ్య, కోళ్ల ఫారం రైతు, బీబీపేట

క్లుప్తంగా

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కేసులు



బాల్కొండ: నకిలీ విత్తనాలను విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని మెండోరా ఎస్సై శ్రీనివాస్ యాదవ్ హెచ్చరించారు. మండలంలోని సావెల్, కోడిచర్ల, వెల్కటూర్ గ్రామాల్లో సీడ్స్, పెస్టిసైడ్స్ దుకాణాల్లో సోమవారం ఆయన తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్తీ మందులు, నకిలీ విత్తనాలు అమ్మితే లైసెన్సులు రద్దు చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామన్నారు. సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి



డిచ్‌పల్లి: భూగర్భ జలాల పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని, ప్రజలందరూ ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని డీఎల్‌పీవో నాగరాజు సూచించారు. డిచ్‌పల్లి మండలం ముల్లంగి(ఐ) గ్రామాన్ని సోమవారం డీఎల్‌పీవో సందర్శించారు. గ్రామంలో నిర్మిస్తున్న సాధారణ ఇంకుడు గుంత నిర్మాణ పనులను, పల్లె ప్రకృతి వనం, డంపింగ్‌యార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇంకుడు గుంతల నిర్మాణం వల్ల నీటి వృథాను అరికట్టవచ్చన్నారు. తద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయని బోర్లు ఎత్తిపోకుండా ఉంటాయన్నారు. ఇన్‌చార్జి ఎంపీవో నిట్టు కిషన్‌రావు, పంచాయతీ కార్యదర్శి గంగాధర్ ఉన్నారు.

రెమ్యూనరేషన్ డబ్బులు ఇప్పించండి



ఆర్మూర్‌టౌన్: ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలు వచ్చాయి కానీ, స్పాట్ వాల్యూయేషన్ రెమ్యూనరేషన్ డబ్బులు ఇప్పటికీ రాలేదని, వెంటనే ఇప్పించాలని టీపీఎల్ఎఫ్ జిల్లా జనరల్ సెక్రటరీ మల్లికార్జున్‌గౌడ్ పేర్కొన్నారు. పట్టణంలో సోమవారం టీపీఎల్ఎఫ్ (తెలంగాణ ప్రైవేట్ లెక్చరర్ యూనియన్) ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ 'స్పాట్ రెమ్యూనరేషన్' గురించి ప్రైవేట్ అధ్యాపకుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెమ్యూనరేషన్ డబ్బులు ఇంత వరకు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రెండు రోజుల్లో రెమ్యూనరేషన్ రాకపోతే.. సప్లమెంటరీ స్పాట్‌ని 'బాయ్ కాట్' చేస్తామన్నారు. ఈ విషయంలో డీఐఈవో స్పందించడం లేదన్నారు. టౌన్ ప్రెసిడెంట్ గజానంద్, ఆర్మూర్ ఇన్‌చార్జి మురళిగౌడ్, స్వామి సదానంద్ పాల్గొన్నారు.

3411 మందికి కంటి పరీక్షలు

కామారెడ్డి టౌన్: జిల్లాలో సోమవారం జరిగిన కంటి వెలుగు శిబిరాల్లో 3411 మందికి కంటి పరీక్షలను వైద్య సిబ్బంది నిర్వహించారు. 327 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. దీంతో జిల్లాలో ఇప్పటి వరకు 4,30,225 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 63,326 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. జిల్లాలో 89.16శాతం లక్ష్యాన్ని పూర్తి చేశారు.

పెండింగ్ లేకుండా అర్జీలను పరిష్కరించాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- ప్రజావాణిలో 116 ఫిర్యాదుల స్వీకరణ



ఫిర్యాదుదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్: ప్రజావాణిలో వచ్చిన అర్జీలను పెండింగ్ లేకుండా పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. నగర శివారులోని కొత్త కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 116 ఫిర్యాదులు అందాయి. ఎండలు మండుతున్నా.. సమస్యలను విన్నవించేందుకు జిల్లా నలుమూలల నుంచి ఫిర్యాదుదారులు తరలివచ్చారు. ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్,డీఆర్డీఓ చందర్, జెడ్పీ సీఈఓ గోవింద్, డీపీఓ జయసుధలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.

భూ సమస్యను పరిష్కరించాలని..

డిచ్‌పల్లి మండలంలోని ఘన్‌పూర్, ముల్లంగి గ్రామాల మధ్యనున్న 349 అసైన్డ్ భూమి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎంఆర్‌పీఎస్ నాయకులు ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. ఘన్‌పూర్ గ్రామ వీడీసీ ప్రతినిధులు ఈ భూమి తమ గ్రామానికి చెందినదని, సాగు చేయడానికి వీల్లేదని తహసీల్దార్‌కు ఫిర్యాదుచేశారని తెలిపారు. బీపీఎల్‌కు చెందిన తమకు ఆ భూమి చెందేవిధంగా చట్టపరంగా ఎలాంటి సమస్య రాకుండా చూడాలని వారు కోరారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని..



ఖలీల్‌వాడి: మధ్యాహ్న భోజన కార్మికులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే ఇవ్వాలని యూనియన్ (సీఐటీయూ) జిల్లా కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు వినతిపత్రం అందజేశారు. మధ్యాహ్న భోజన పథకం యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్యాల గోవర్ధన్ మాట్లాడుతూ.. కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.3000 గౌరవ వేతనం జీవో విడుదల చేసినప్పటికీ వాటిని చెల్లించడం లేదన్నారు. తమ సమస్యలు పరిష్కారం చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. ప్రతినిధులు చామంతి లక్ష్మి, వర్కింగ్ ప్రెసిడెంట్ కొండగం గాధర్, కోశాధికారి పర్వమ్మ, ఉపాధ్యక్షులు సురేందర్‌రెడ్డి ఉన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలని ధర్నా..



సుభాష్‌నగర్: ధర్పల్లి మండలంలోని దుబ్బాక సర్వేనెంబర్ 979లోగల ప్రభుత్వ భూమి పూర్తి గా కబ్జాకు గురైందని, వెంటనే తమ గ్రామాని కి ఇప్పించాలని గ్రామస్తులు డిమాండ్‌చేశారు. ఈమేరకు దుబ్బాక నుంచి పెద్ద సంఖ్యలో గ్రామస్తులు తరలివచ్చి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ప్లకార్డులతో నిరసన ప్రదర్శన తెలియజేశారు. అనంతరం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కబ్జా చేసిన వారికి పట్టా హక్కులు కల్పించవద్దని, తిరిగి గ్రామానికి ఇప్పించాలని వారు డిమాండ్‌చేశారు. లేకుంటే రానున్న రోజుల్లో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

కొత్త ప్రాజెక్టుల కోసం దరఖాస్తు చేసుకోవాలి



అధ్యాపకులతో మాట్లాడుతున్న వీసీ రవీందర్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ బయోటెక్నాలజీ విభాగం అధ్యాపకులు మరిన్ని పరిశోధనల కోసం కేంద్ర ప్రభుత్వం డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డీఎస్‌టీ), డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ (డీబీటీ)తో పాటు ఫండింగ్ ఏజెన్సీలకు దరఖాస్తు చేసుకోవాలని వీసీ ప్రొఫెసర్ రవీందర్ సూచించారు. తెయూలోని ఆర్ట్స్ అండ్ సైన్స్‌కాలేజీలోగల బయోటెక్నాలజీ విభాగం ల్యాబోరేటరీని సోమవారం వీసీ సందర్శించారు. ల్యాబ్‌లో నానో టెక్నాలజీని ఉపయోగించి జెనెటిక్ ఇంజనీరింగ్‌లో మొక్కల కణజాలంలో చేస్తున్న ప్రయోగాలను విభాగాధిపతి జవేరియా ఉజ్మా, అధ్యాపకుడు మామిడాల ప్రవీణ్ కుమార్‌లు వీసీ రవీందర్‌కు వివరించారు. వారి ప్రయోగాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. బయోటెక్నాలజీలో వస్తున్న మార్పులపై ఎప్పటికప్పుడు అవగాహన పెంపొందించుకుని కొత్త విషయాలు కనుగొని పేటెంట్‌లు పొందాలని వారికి సూచించారు.

ముగిసిన వాలీబాల్ టోర్నమెంట్



కామారెడ్డి టౌన్: పట్టణంలోని సరస్వతి శిశుమందిర్ మైదానంలో కామారెడ్డి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ పోటీల్లో బాయ్స్ విభాగంలో తాడ్వాయి విజేతగా, రన్నరప్‌గా మాచారెడ్డి నిలిచింది. బాలికల విభాగంలో నిజాంసాగర్ విజేతగా, తాడ్వాయి రన్నరప్‌గా నిలిచారు. విజేతలను కలెక్టర్ జితేష్ పాటిల్ అభినందించారు. రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృత్యువాత పడ్డారు. వారిలో ఒకరు బాన్సువాడ పట్టణంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతిచెందగా.. జుక్కల్ మండలంలో ఓ వ్యక్తి ధాన్యం కుప్పలను తప్పించబోయి, లారీని ఢీకొనగా మృతిచెందాడు. అలాగే సదాశివనగర్ మండలంలో బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు.



నర్ర ఎల్లప్ప మృతదేహం

బాన్సువాడ: పట్టణంలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతిచెందినట్లు సీఐ మహేందర్‌రెడ్డి సోమవారం తెలిపారు. వివరాలు ఇలా.. కొల్లూర్ గ్రామానికి చెందిన నర్ర ఎల్లప్ప (35), సలీం అనే ఇటుకబట్టి యజమాని వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం ఎల్లప్ప పని కోసం తెలిసిన వ్యక్తి బైక్‌పై బాన్సువాడ వెళ్లాడు. తిరిగి ఇంటికి రాలేదు. పట్టణంలో ఓ వ్యక్తి మృతిచెందడంతో తెల్లవారుజామున స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని, మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. ఎల్లప్ప తండ్రి లస్మయ్యకు పోలీసులు సమాచారం ఇవ్వడంతో, ఆయన ఆస్పత్రికి వెళ్లి మృతదేహం తమ కుమారుడిదేనని తెలిపాడు. గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతోనే ఎల్లప్ప మృతి చెందినట్లు, మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వడ్ల కుప్పను తప్పించబోయి..



మృతదేహాన్ని పరిశీలిస్తున్న జుక్కల్ ఎస్సై మురళి

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలం బాలాజీ నగర్ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దాదారావుపటేల్(45) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై మురళి తెలిపారు. మహారాష్ట్రలోని మార్తోలి గ్రామానికి చెందిన దాదావు, జుక్కల్ మండలంలోని ఖండెబల్లూర్ గ్రామంలోని అత్తగారింటికి బైక్‌పై బయలుదేరాడు. బాలాజీనగర్ శివారులో ధాన్యం కుప్పలను తప్పించబోయి, ఎదురుగా వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టాడు. ఈప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దాదారావు అక్కడిక్కడే మృతి చెందాడు. రోడ్డు ప్రమాదం దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయని, రోడ్డు ప్రమాదానికి కారణమైన లారీని పట్టుకున్నామని చెప్పారు. మృతుడి కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొని..



మృతిచెందిన మహిపాల్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): పుట్టుగొంగలి కప్పుకొని వ్యవసాయ బావి వద్దకు బైక్‌పై వెళ్లిన ఓ వ్యక్తి, అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టినడంతో మృతి చెందినట్లు ఎస్సై రాజేశ్ సోమవారం తెలిపారు. మండల కేంద్రానికి చెందిన రెడ్డిమహిపాల్(32)అనే యువకుడు పుట్టుగొంగలి కప్పుకొని వ్యవసాయ బావి వద్దకు బైక్‌పై వెళ్తున్నాడు. మార్గమధ్యలో వాహనం అదుపుతప్పడంతో చెట్టుకు ఢీకొట్టాడు. దీంతో అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. వెంటనే క్షతగాత్రుడిని కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు నిజామాబాద్‌కు తరలిస్తుండగా మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య లావణ్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చిరుత దాడిలో దూడ మృతి

లింగంపేట: మండల కేంద్రం సమీపంలోని పెద్దవాగు పరివాహక ప్రాంతం అడవిలో గ్రామానికి చెందిన ఆవుల మనోహర్‌కు చెందిన దూడపై ఆదివారం రాత్రి చిరుతపులి దాడి చేసిన హతమార్చినట్లు బాధితుడు తెలిపారు. ఆటవీ ప్రాంతంలోని వ్యవసాయ బోరు వద్ద మనోహర్ తన పశువులను కట్టేశాడు. సోమవారం ఉదయం వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి చూడగా దూడ మృతి చెంది ఉంది. విషయాన్ని అటవీశాఖ, పశువైద్యాధికారికి సమాచారం ఇచ్చారు. అదే కొట్టంలో మరికొన్ని పశువులు ఉన్నాయి. కేవలం దూడపై దాడి చేయడంతో మృతి చెందినట్లు తెలిపారు. అధికారులు పంచనామ నిర్వహించి చిరుతపులి దాడి చేసినట్లు తెలిపారు. చిరుత గ్రామ శివారులో సంచరిస్తూ పశువులపై దాడి చేస్తుండడంతో రైతులు, పశువుల కాపరులు, మేకలు, గొర్ల కాపరులు భయాందోళనకు గురవుతున్నారు.

విద్యుత్ షాక్‌తో ఆవు..



మృతి చెందిన ఆవు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మండలంలోని తిమ్మారెడ్డితండాలో విద్యుత్ షాక్‌తో ఆవు మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని మాలావత్ రాములుకు చెందిన ఆవు సోమవారం పంట పొలాల్లో మేతకు వెళ్లగా ట్రాన్స్‌ఫార్మర్‌కు ఉన్న విద్యుత్ తీగలు తగిలి మృతి చెందినట్లు వారు తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి నష్టపరిహారం అందేలా చర్యలను తీసుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

మద్యానికి బానిసై.. ఆరోగ్యం క్షీణించి వ్యక్తి..

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ శివారులోని బెల్లాల్ గ్రామంలో ఓ వ్యక్తి మద్యానికి బానిసై, ఆరోగ్యం క్షీణించడంతో మృతిచెందాడు. ఎస్సై నవీన్ తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని కల్వూర్కి గ్రామానికి చెందిన సోలంకి రాములు (43) కొంతకాలం క్రితం సీస కమ్మరి పని నిమిత్తం బెల్లాల్ గ్రామానికి కుటుంబంతో కలిసి వలస వచ్చాడు. పది రోజుల క్రితం రాములు తన భార్యతో గొడవ పడగా, అమె పిల్లలను తీసుకొని వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన రాములు మద్యానికి బానిసై, ఆహారం తీసుకోకపోవడంతో ఆరోగ్యం క్షీణించి సోమవారం మృతిచెందాడు. మృతుడి తమ్ముడు మోహన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించామన్నారు.

ఆటోను ఢీకొన్న లారీ: డ్రైవర్‌కు గాయాలు



నిజామాబాద్ సిటీ: నగరశివారు కొత్త కలెక్టరేట్ సమీపంలో సోమవారం సాయంత్రం లారీ ఆటోను ఢీకొన్న ఘటనలో డ్రైవర్‌కు గాయాలు అయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. అర్సపల్లి నుంచి నిజామాబాద్ వైపు వస్తున్న ఆటోను లారీ ఎదురుగా వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ వాజీద్ ఆటోలోనే ఇరుక్కుపోయాడు. స్థానికులు వెంటనే లారీని వెనక్కి లాగి, ఆటోలో ఇరుక్కున్న వాజీద్‌ను బయటకు తీసేందుకు ప్రయత్నించారు. రూరల్ పోలీసులు అక్కడకు చేరుకుని డ్రైవర్‌ను బయటకు తీశారు. డ్రైవర్ నుదుటి, చేతికి గాయాలు అయినట్లు ఎస్సై లింబాద్రి తెలిపారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కామారెడ్డి ప్రజావాణికి 50 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఏవో రవీందర్

కామారెడ్డి క్రైం: పట్టణ శివారులోని కామారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించగా.. కలెక్టరేట్ ఏవో రవీందర్ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. మొత్తం 50 ఫిర్యాదులు రాగా.. వాటిలో 33 ఫిర్యాదులు రెవెన్యూ శాఖకు సంబంధించినవే కావడం గమనార్హం. మిగితావి ఆయా శాఖల ఫిర్యాదులు నమోదయ్యాయి. వచ్చిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులకు పంపి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఏవో తెలిపారు. ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. జిల్లా ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు సాయి భుజంగరావు, బీసీ తరగతుల సంక్షేమ అధికారి శ్రీనివాస్, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా విఠలేశ్వర విగ్రహ ప్రతిష్ఠాపన



ఆలయంలో గణేష్ గుప్తా బ్రదర్స్‌తో మంత్రి ప్రశాంత్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు

మాక్లూర్: మండలకేంద్రంలో నూతనంగా నిర్మించిన అయ్యప్ప, ఆంజనేయ, రుక్మిణి పాండురంగ విఠలేశ్వర ఆలయంలో సోమవారం విఠలేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు వైభవంగా కొనసాగాయి. తమ తండ్రి సంకల్పంతో తనయులు బిగాల గణేష్‌గుప్తా, మహేష్‌గుప్తాలు ఆలయాన్ని పునః నిర్మించి, విగ్రహ ప్రతిష్ఠాపక కార్యక్రమాలు చేపట్టారు. వేడుకల్లో మంత్రి ప్రశాంతిరెడ్డి, రాజ్యసభ సభ్యుడు సురేష్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావులు పాల్గొని వారిని అభినందించారు. ఉత్సవాలతో మండల కేంద్రం పండుగ వాతావరణంతో సందడిగా మారింది. గ్రామస్తులందరు ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దేవత మూర్తుల ఊరేగింపు కన్నుల పండువగా కొనసాగింది. భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణంలో తగిన ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం అన్నదానం కార్యక్రమం ప్రారంభించగా.. మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నిజామాబాద్ నార్త్ జోన్ సీఐ నరహరి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఘనంగా భాగ్యరెడ్డి వర్మ జయంతి



భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్, అధికారులు

సుభాష్‌నగర్: దళిత మహిళలు, విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేసిన భాగ్యరెడ్డి వర్మ జయంతిని సోమవారం నిజామాబాద్ కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఇతర జిల్లా అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకుముందు జ్యోతి ప్రజ్వలన చేసి జయంతి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. దళితుల అభ్యున్నతికి, దళిత మహిళల విద్యార్జన కోసం భాగ్యరెడ్డి వర్మ ఎనలేని కృషి చేశారని వక్తలు గుర్తుచేశారు. భాగ్యరెడ్డి వర్మ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించిన నేపథ్యంలో సాంఘిక సంక్షేమ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా సాంఘిక సంక్షేమ అభివృద్ధి శాఖ అధికారిణి శశికళ, జెడ్పీ సీఈవో గోవింద్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేష్, జిల్లా కార్మికశాఖ అధికారి యోహాన్, డీడబ్ల్యూవో రసూల్‌బీ, ట్రాన్స్‌కో ఎస్ఈ రవీందర్, డీఈఓ దుర్గాప్రసాద్, మైనింగ్ ఏడీ సత్యనారాయణ, డీఐఈఓ రఘురాజ్, కలెక్టరేట్ ఏఓ ప్రశాంత్ పాల్గొన్నారు.

'మహిళా భవనం ఇవ్వొద్దని వినతి'



కలెక్టరేట్‌కు తరలివచ్చిన సంఘం ప్రతినిధులు

సుభాష్‌నగర్: పెర్కిట్ మహిళా పరస్పర సహాయక సహకార పొదుపు, పరపతి గ్రామ సంఘం మహిళా భవనాన్ని ఏ ప్రభుత్వ శాఖకు ఇవ్వొద్దని సంఘం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌కు తరలివచ్చి మెప్మా పీడీ రాములుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెర్కిట్‌లో 205 సంఘాల్లో 2,050 మంది సభ్యులు ఉన్నారని తెలిపారు. 2013 నుంచి రెండేళ్లపాటు అధికారుల చుట్టూ తిరిగితే మహిళా భవనం నిర్మించి ఇచ్చారన్నారు. ప్రస్తుతం ఈ భవనాన్ని ఇష్టానుసారంగా వివిధ శాఖలకు అప్పగిస్తున్నారని, మూడ్రోజుల క్రితం తమకు ఎలాంటి సమాచారమివ్వకుండా బస్తీ దవాఖాన కోసం ప్రహరీని కూల్చేశారని పేర్కొన్నారు.

కరుణం కుంటకు డాగ్‌స్క్వాడ్



బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని రాకాసీపేట్ పోచమ్మ ఆలయంలోగల కలప ఉత్సవ విగ్రహాలను గుర్తుతెలియని దుండగులు కరుణం కుంటలో పడేశారు. దీంతో ఈ ఘటనలో సోమవారం పోలీసులు డాగ్ స్క్వాడ్‌ను తీసుకు వచ్చారు. దుండగుల ఆనవాళ్ల కోసం ఆలయం నుంచి కరుణం కుంట పరిసర ప్రాంతాల్లో తిరిగిన డాగ్‌స్క్వాడ్ తిరిగి ఆలయం వద్దకు చేరుకుంది. తనిఖీల్లో ఎస్ఐ పీటర్, గ్రామాభివృద్ధి కమిటీ ప్రతినిధులు ఉన్నారు.

బాలిక అదృశ్యం

రాజంపేట: మండలంలోని బస్వన్నపల్లి గ్రామంలో ఓ బాలిక అదృశ్యమైనట్లు ఎస్సై రాజు ఆదివారం తెలిపారు. గ్రామానికి చెందిన బాలిక ఈ నెల 19న అదృశ్యమవగా.. బాలిక తల్లిదండ్రుల సోమవారం ఫిర్యాదు చేశారన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

డీకంపల్లిలో వివాహిత..

మాక్లూర్: మండలంలోని డీకంపల్లి శివారులోగల జ్యోతినగర్‌కు చెందిన అనురాధ అనే వివాహిత ఈనెల 18న అదృశ్యం కాగ.. ఆమె భర్త గంగారాం సోమవారం మాక్లూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్కూల్ బస్ డ్రైవర్‌గా పని చేసే గంగారాం ఈ నెల 18న విధులు ముగించుకొని ఇంటికి చేరుకున్నాడు. ఇంట్లో 12ఏళ్ల కుమారుడు, 8నెలల పాప పడుకొని ఉన్నారు. భార్య కనిపించకపోవడంతో చుట్టుపక్కల ఎంతవెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో అతడు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నగరంలో యువకుడు..



రాజు

ఖలీల్‌వాడి: నగరంలోని గాజుల్‌పేట్‌కు చెందిన మల్కాయ్ రాజు(35) అదృశ్యం అయినట్లు ఎస్సై పూర్ణేశ్వర్ సోమవారం తెలిపారు. ఆటో డ్రైవర్‌గా పనిచేసే రాజు ఈనెల 16న ఇంటి నుంచి వెళ్లి, తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు ఎంతవెతికినా అతడి ఆచూకీ లభించలేదు. దీంతో అతడి భార్య పుష్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. ఇంటి నుంచి వెళ్లినప్పుడు, అతను పింక్ కలర్ షర్ట్, వైట్ కలర్ ప్యాంట్ ధరించాడన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రేమించి, మోసం చేసిన యువకుడి అరెస్టు

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని పెద్ద దేవాడ గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన యువకుడిని అరెస్టు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు. పెద్ద దేవాడ గ్రామానికి చెందిన యువతి, మద్నూర్ మండలం మోఘ గ్రామానికి చెందిన మారుతి గత మూడు సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నారు. సదరు యువతిని పెళ్లి చేసుకుంటానని చెప్పి, మారుతి మరో అమ్మాయితో పెళ్లికి సిద్ధమయ్యాడు. దీంతో తనను మోసం చేశాడని సదరు యువతి బిచ్కుంద పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో ఎస్సై విచారణ జరిపి కేసునమోదు చేసి యువకుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

వరి పంటకు నిప్పు



కాలిపోయిన పంటను పరిశీలిస్తున్న అధికారులు

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలోని కొమ్ముల మోహన్‌రెడ్డికి చెందిన 30 గుంటలు, కొమ్ముల గంగయ్యకు చెందిన 30గుంటల భూమిలో సాగు చేస్తున్న వరి పంటకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో పూర్తిగా కాలి బూడిదైంది. కాలిన పంటను ఆర్ఐ గంగాధర్ సోమవారం పరిశీలించారు. సుమారుగా రూ.92వేల నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు. ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామన్నారు.